సంక్షోభంలో వస్త్ర పరిశ్రమ

- బకాయిలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలి
- రాజకీయ కోణంలో కాకుండా ప్రజా సమస్యగా చూడాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య
- కార్మికుల నినాదాలతో దద్దరిల్లిన 'నేతన్న మహా గర్జన'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సిరిసిల్లకు సాంచాలే గుండె చప్పుడు. అటువంటి చప్పుడు ఆగే పరిస్థితి నెలకొంది. వెంటనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బకాయిలు చెల్లించి, కొత్తగా ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్లే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నెలకొంది' అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సుమారు రెండువేల మంది కార్మికులు శనివారం 'నేతన్న మహాగర్జన' నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతోనే సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. చేనేత, టెక్స్‌టైల్ బోర్డును కేంద్రంలోని బిజెపి రద్దు చేసిందని, కనీసం ఇక్కడి కార్మికుల గురించి ఆలోచించినా వారికి కొంత ఉపశమనం లభించేదన్నారు. ముఖ్యంగా యారన్, ఇతర వస్త్రాల ఉత్పత్తిపై నాలుగు శాతంగా ఉన్న జిఎస్‌టిని 12శాతానికి పెంచి నేతన్నల నడ్డి విరిచిందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మికవర్గంపై చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. ఆయా కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తూ బహుళజాతి కంపెనీల పనులు వేగంగా జరిగేలా సాయం అందిస్తున్న కేంద్రం.. ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో కార్మికులు, నష్టాల్లో నడుస్తున్న వస్త్ర పరిశ్రమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



మహాగర్జన సభలో మాట్లాడుతున్న వీరయ్య

రాష్ట్రంలో గత సర్కారు ఈ ప్రాంత పరిశ్రమకు ఇచ్చిన ఆర్డర్ల బకాయిలు చెల్లించకపోవడం, ఇప్పుడున్న సర్కారు కనీసం దాని గురించి ఆలోచించకపోవడం బాధాకరమని అన్నారు. రాయితీపై యారన్, కరెంటు కూడా ఇవ్వలేదన్నారు. కనీస సౌకర్యాలు కల్పించపోవడంతో కార్మికుల కోసం నిర్మించిన అపరల్ పార్క్‌లోని షెడ్లల్లో తొండలు గుడ్లు పెడుతున్నాయని ఎద్దేవా చేశారు. మూన్నెళ్లుగా ఉపాధి లేక 30వేల మంది కార్మికులు రోడ్డునపడ్డారని, తినడానికీ తిండి లేక ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల కిందట పవర్‌లూమ్ కార్మికుడు శ్రీనివాస్, శనివారం మరో కార్మికుడు సిరిపురం సత్యనారాయణ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు అద్దం పడుతోందన్నారు. సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారే ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులెవరూ ప్రాణం తీసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. సమస్య పరిష్కారం కోసం పోరాడుదామని, దీన్ని రాజకీయ కోణంలోగాకుండా ప్రజా సమస్యగా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. పాలక, ప్రతిపక్షాలు ఒకరిపైనొకరు ఆరోపణలు చేసుకోకుండా ఈ ప్రాంత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతన్నల సమస్యలు పరిష్కరించాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్లను కోరినట్టు తెలిపారు. స్పందించిన మంత్రులు సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని చెప్పారు. నేతన్నలకు ఉపాధి కల్పించి, సిరిసిల్ల గుండె చప్పుడును కాపాడాలన్నారు. ఈ నేతన్నల మహాగర్జనలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సిఐటియు రాష్ట్ర పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, సిఐటియు, ఇతర సంఘాల జిల్లా నాయకులు మూషం రమేష్, పంతం రవి, కోడం రమణ, తాటిపాముల దామోదర్, మంచే శ్రీనివాస్, మండల సత్యం, వెళ్లండి దేవదాస్, సిరిసిల్ల రవీందర్, మోర రాజు, లక్ష్మీనారాయణ, వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వారితో రాజీనామా చేయించాలి

- రాహుల్ గాంధీకి కెటిఆర్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించాలనీ, లేదంటే స్పీకర్ ద్వారా అనర్హత వేటు వేయించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. అలా చేయడం ద్వారా చెప్పిందే చేస్తాం, అబద్ధాలు చెప్పమనే విషయాన్ని నిరూపించుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఆయన శనివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. భారతదేశంలో ఇతర పార్టీల నుంచి నేతలను చేర్చుకోవడం ప్రారంభించిందే కాంగ్రెస్ అని విమర్శించారు. తాను ప్రారంభించిన ఆయారాం- గయారాం సంస్కృతిపైన కాంగ్రెస్ ఇప్పటికైనా విధానం మార్చుకోవడం మంచిదేనని తెలిపారు. ఆ పార్టీ తన మ్యానిఫెస్టోలో పార్టీ మారితే ఆటోమేటిగ్గా సభ్యత్వం రద్దు అనే హామీని పేర్కొనడం స్వాగతించదగిందని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎప్పటిలానే చెప్పేదొకటి చేసేదొకటిగా ఉంటుందని తెలిపారు. తాను హామీ ఇచ్చిన దానికి పూర్తి వ్యతిరేకంగా కాంగ్రెస్ విధానాలుంటాయని విమర్శించారు. ఒకవైపు మ్యానిఫెస్టోలో ఇతర పార్టీల నుంచి చేర్చుకోమంటూనే... తెలంగాణలో కారు గుర్తుపై గెలిచిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు ఎంపి టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. మరో బిఆర్ఎస్ ఎమ్మెల్యేను రాజీనామా చేయకుండానే పార్టీలో చేర్చుకుందని తెలిపారు. రాహుల్ గాంధీకి తమ హామీలపైన నిబద్ధత ఉంటే ఈ అంశంపైన మాట్లాడాలని సూచించారు. లేకుంటే ఆయన ఒక హిపోక్రట్‌గా మిగిలిపోతారని పేర్కొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నేడు పరీక్ష

- అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో మొత్తం సీట్లతోపాటు ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఆదివారం ప్రవేశ పరీక్ష జరగనుంది. అదేరోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతికి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 62,983 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోకుండా అభ్యర్థులు ఎవరైనా ఉంటే వశ్రీఖుఅస్త్రుఖుఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా వెంటనే వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వైద్య శాఖను ప్రక్షాళన చేస్తాం

- సీనియార్టీ ప్రకారమే ప్రమోషన్‌లు
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వైద్య శాఖను ప్రక్షాళన చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకుని ఉస్మానియా మెడికల్ కళాశాల అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి హాజరై విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య కళాశాలలు, వైద్యశాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి విషయం కోర్టులో ఉందని.. అది తేలగానే ఆధునిక ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రస్తుతం కమిషనర్లను, డైరెక్టర్లను సీనియార్టీ ప్రకారం నియమిస్తున్నామని తెలిపారు. వైద్య శాఖలో సీనియార్టీకి ప్రాధాన్యత ఇస్తూ ప్రమోషన్‌లు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రత్యేక చికిత్సలు ఉండేలా కృషి చేస్తామన్నారు. వైద్యాధికారులు, ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఉస్మానియా అంటేనే ఒక బ్రాండ్ అని.. అది మెడికల్ అయినా ఇంజనీరింగ్ అయినా ఉస్మానియానే అన్నారు. రాష్ట్రంలో మోడల్ లెక్చర్ హాల్స్, హాస్టల్ బిల్డింగ్స్ నిర్మిస్తామని తెలిపారు. జూన్‌లో వీటికి ప్రత్యేక బడ్జెట్‌ను తీసుకొచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మెడికల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ యాదవ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శివ శివరాంప్రసాద్, అసోసియేషన్ చైర్మెన్ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి కృష్ణమూర్తి, ఆఫీస్ ఇన్‌చార్జి రఘుమోహన్, వేణుగోపాల్ గౌడ్, పూర్వ వైద్య విద్యార్థులు, యువ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు పతకాలు ప్రదానం చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

బిల్ కలెక్టర్లకు విద్యుత్ సంస్థలోనే ఉపాధి కల్పించాలి

- ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిల్ కలెక్టర్లకు విద్యుత్ సంస్థలోనే ఇతర ఉపాధి కల్పించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు అధ్యక్షతన శనివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ బిల్ కలెక్టర్లందరికీ లేబర్ కమిషనర్ జారీ చేసిన జిఒ నెంబర్ 11 ప్రకారం స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. ఎపిఎస్ఇబి కాలం నుంచి విద్యుత్ సంస్థలో బిల్ కలెక్టర్ల వ్యవస్థ ఉందనీ, ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ (రెండు డిస్కం) లలో దాదాపు 650 మంది పని చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు జీరో బిల్ సిస్టం పెట్టిన తర్వాత 80 శాతం మంది వినియోగదారులకు బిల్లులు చెల్లించే అవసరం లేకుండా పోయిందని చెప్పారు. మిగిలిన 20 శాతం మంది ఆన్‌లైన్‌లోనే బిల్లులు చెల్లిస్తున్నారని చెప్పారు. దీంతో బిల్ కలెక్టర్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదనీ, 20 నుంచి 25 ఏళ్లుగా విద్యుత్ సంస్థనే నమ్ముకుని బతుకుతున్న బిల్ కలెక్టర్లు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

1379 కేజీల గంజాయి దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 26 కేసుల్లో 1379 కేజీల గంజాయిని సీజ్ చేసి.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం దగ్ధం చేసినట్టు ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో శనివారం జిల్లా ఎస్‌పి, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 26 కేసుల్లో రూ.కోటి 93లక్షల విలువగల 1379 కిలోల గంజాయిని సీజ్ చేసి నిర్వీర్యం చేసినట్టు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు.

గుడిసెల ధ్వంసం అప్రజాస్వామికం

- గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను విడుదల చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్‌లో పైడిపల్లి- కొత్తపేట శివారులో రెండున్నరేండ్లుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న 1,200 మంది పేదల మీద శుక్రవారం రాత్రంతా పోలీసులు విధ్వంసం సృష్టించారని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. స్టాలిన్ నగర్‌గా పేరుపెట్టుకున్న ఆ ప్రాంతం మొత్తాన్ని ధ్వంసం చేశారని విమర్శించింది. పేదలకు ఇండ్ల పట్టాలిస్తామనీ, ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి రూ.ఐదు లక్షల సహాయం చేస్తామంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేసింది. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న ఆ పేదలకు పట్టాలు ఇవ్వొచ్చనీ, ఇండ్లు కట్టుకోవడానికి సహాయం చేయొచ్చని పేర్కొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనీ, ఈ ధోరణిని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలు గుడిసెలు వేసుకున్నందుకు స్థానిక రైతులకు కూడా కొంత సౌలభ్యం ఏర్పడిందని తెలిపారు. పక్కనున్న వ్యవసాయ మార్కెట్‌లో కూడా కొన్ని సౌకర్యాలు ఏర్పడ్డాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక గ్రామీణ ప్రజలు, ఈ గుడిసె వాసులు పరస్పరం సహకరించుకుంటూ సంతోషంగా ఉన్న సమయంలో ఉన్నట్టుండి పోలీసులు విరుచుకుపడ్డారని పేర్కొన్నారు. సిపిఎం నాయకుడు బషీర్‌ను అరెస్టు చేశారని తెలిపారు. ఇతర నాయకుల కోసం ఇప్పుడు వెతుకుతున్నారని వివరించారు. ఇంతకంటే అన్యాయం ఏముంటుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందంటూ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మహబూబాబాద్‌లో గుడిసెలను కూల్చివేశారని తెలిపారు. ఆ తర్వాత హన్మకొండలో ఒక కేంద్రంలో, జగిత్యాల, కోరుట్లలో గుడిసెలను ధ్వంసం చేశారని విమర్శించారు. జగిత్యాల, కోరుట్లలో గుడిసెలు ధ్వంసం చేసేటప్పుడు 307 సెక్షన్ కింద కూడా కేసులు పెట్టి నాయకులను 33 రోజులు జైలులో పెట్టారని పేర్కొన్నారు. తర్వాత బచ్చన్నపేటలో గుడిసెలు ధ్వంసం చేసి, ఇప్పుడు మళ్లీ వరంగల్‌లోని స్టాలిన్‌నగర్‌లో గుడిసెలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనిపించుకోదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ గుడిసె వాసులకు పట్టాలిచ్చి, ఇండ్లు కట్టుకోవడం కోసం ప్రతి కుటుంబానికీ రూ.ఐదు లక్షల సహాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

ప్రజాస్వామ్య రక్షణకు బిజెపిని ఓడించాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్
- వనపర్తిలో ఎం.రాములు సంస్మరణ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం.రాములు సంస్మరణ సభను పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. ఎం.రాములు అనారోగ్యంతో మరణించడం బాధాకరమని అన్నారు. విద్యార్థి ఉద్యమంలోనూ, ఉపాధ్యాయ ఉద్యమంలోనూ, సైన్స్ ఉద్యమంలోనూ, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కులం- కులతత్వం, మతం -మతతత్వం, శాస్త్రీయ అవగాహన తదితర అనేక అంశాలపై కార్యకర్తలకు అవగాహన క్లాసులు బోధించారని గుర్తుచేశారు. జిల్లా స్టడీ సర్కిల్లో రెగ్యులర్ విద్యార్థిగా ఉండేవారని, నిత్య అధ్యయనశీలి అని కొనియాడారు. సిపిఎం బలోపేతం, సెక్యులర్ శక్తులను బలోపేతం చేయడం.. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఇడి, ఐటి, సిబిఐ తదితర స్వతంత్ర సంస్థల ద్వారా వేధింపులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి వెంట ఉంటే నీతిపరులు, వెలుపల ఉండి వ్యతిరేకిస్తే అవినీతిపరులని ముద్ర వేసి జైల్లోకి పంపుతున్నారన్నారు. అందులో భాగంగానే డిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, కవిత తదితరులను జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుంచి నిధులు కాజేసి ప్రజల ఓట్లకు గాలాలు వేస్తున్న బిజెపినే దేశంలో అతిపెద్ద అవినీతి పార్టీ అని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు, సామాన్యులపై భారాలు మోపుతోందని, హిందూ- ముస్లిముల మధ్య తగాదాలు సృష్టించి ఓట్ల రాజకీయం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, సిపిఎం సీనియర్ నాయకులు, ఆర్.రామ్‌రెడ్డి, ఎం.నాగిరెడ్డి, ఎం.కృష్ణయ్య, రఘుపతి రెడ్డి, సీనియర్ జర్నలిస్టు ఉషన్న, రాజారాం ప్రకాష్, ఎం.రాములు భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు విక్రమ్, అల్లుడు డాక్టర్ శ్రీనివాసులు, బావమరిది చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వెంకట్

44.5 డిగ్రీల ఎండ

- రాష్ట్రంలో మరింత పెరిగిన ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోళ్లు పగిలేలా కొట్టే ఎండలు సాధారణంగా మే చివరి మాసంలో కొడతాయి. కానీ, ఈసారి ఏప్రిల్ మొదటి వారంలోనే దంచి కొడుతున్నాయి. గాలిలో తేమ శాతం కూడా బాగా పడిపోయింది. పొద్దస్తమానం ఫ్యాన్లు నడుస్తున్నా..కూలర్లు పెట్టుకున్నా వేడిగాలితో ఇంట్లో ఉండలేనీ, బయట తిరగలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. నల్లగొండ జిల్లా నాంపల్లి, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెళ్లపాడులో అత్యధికంగా 44.5 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదే కావడం గమనార్హం. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఎల్బీనగర్, జూబ్లీహిల్స్‌లో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదుకాగా, 26 జిల్లాల్లో 43 డిగ్రీలకుపైగా గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. రాష్ట్రంలో ఆదివారం కూడా కొన్ని జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందనీ, రాత్రి పూట కూడా సాధారణం కంటే వాతావరణం వేడిగా ఉండే సూచనలు ఉన్నాయనివాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే, ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ శిక్షణ

- కళాశాల విద్యాశాఖ, ఐఐటి బాంబే మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని డిగ్రీ విద్యార్థులకు ఆడియో, వీడియో రూపంలో వివిధ రకాల సాఫ్ట్‌వేర్‌పై శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో కళాశాల విద్యాశాఖ కమిషనర్, ఐఐటి బాంబేకు చెందిన స్పోకెన్ ఇంగ్లీష్ ట్యుటోరియల్ ప్రాజెక్టు మధ్య శనివారం ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం, ఐఐటి బాంబే, స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు నేషనల్ కో-ఆర్డినేటర్ ఆకాంక్ష సాయిని ఆ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐటి సాఫ్ట్‌వేర్, యూ ట్యుటర్ కోర్సు, మూక్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఈ ప్రాజెక్టు 2009 నుంచి కేంద్ర ప్రభుత్వం వారి ద్వారా నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ ఐసిటి ద్వారా నిర్వహిస్తున్నది. ఈ స్పోకెన్ ట్యుటోరియల్‌లో బేసిక్ ఐటి స్కిల్స్, గ్రాఫిక్, యానిమేషన్, ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, వెబ్ డెవలప్‌మెంట్, డాటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను విద్యార్థులకు అందిస్తుంది. విద్యార్థులు ఐఐటి బాంబే స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు ద్వారా శిక్షణా కార్యక్రమాలను ఇంగ్లీష్, తెలుగు, హిందీ తదితర 22 ప్రాంతీయ భాషల్లో నేర్చుకుంటున్నారు. విద్యార్థులు ఐటి స్కిల్స్, కంప్యూటర్ సంబంధిత సాంకేతిక అంశాల్లో యానిమేషన్, మల్టీ మీడియా ప్రోగ్రాం లాంగ్వేజ్‌లో శిక్షణ పొంది వివిధ రకాల స్కిల్ ఆధారిత ఉపాధి అవకాశాలను అందుకుంటారు. కళాశాల అధ్యాపకులకు కూడా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నది. ఈ స్పోకెన్ ట్యుటోరియల్ జాబ్ ఫెయిర్, జాబ్‌మేళాలు నిర్వహిస్తూ శిక్షితులైన విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు జి యాదగిరి, రాజేంద్రసింగ్, అకడమిక్ గైడెన్స్ అధికారి పి బాలభాస్కర్, అకడమిక్ అధికారి ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌కు 3.41 లక్షల దరఖాస్తులు

- ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకునే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు రికార్డు స్థాయిలో 3,41,548 దరఖాస్తులొచ్చాయి. ఇందులో తెలంగాణ నుంచి 2,83,570 మంది, ఎపి నుంచి 57,978 మంది దరఖాస్తు చేశారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు శనివారంతో ముగిసింది. ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసేకునే అవకాశం మే ఒకటో తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగానికి 2,46,056 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 95,185 మంది, ఆ రెండు విభాగాలకూ 307 మంది కలిపి మొత్తం 3,41,548 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం రూ.250తో ఈనెల తొమ్మిది వరకు, రూ.500తో అదేనెల 14 వరకు, రూ.2,500తో ఈనెల 19 వరకు, రూ.ఐదు వేలతో వచ్చేనెల ఒకటో తేదీ వరకు అవకాశముందని వివరించారు. ఈనెల 29 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మే ఏడు నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. మే ఏడు, ఎనిమిది తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను, తొమ్మిది నుంచి 11 వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాల కోసం https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి సూచించారు.

కెసిఆర్ అబద్ధాలకోరు

- ఆయన మాటలను నమ్మొద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్ పొగరుబోతు, అబద్ధాలకోరు అనీ, ఆయన మాటలను నమ్మొద్దంటూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రజలను కోరారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో కెసిఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమేనని విమర్శించారు. సూర్యాపేటకు నాగార్జునసాగర్ నుంచి తాగునీరు మాత్రమే ఇచ్చామనీ, సాగునీరు కాదని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారమే సూర్యాపేట, పాలేరుకు నీళ్లిచ్చామే తప్ప కెసిఆర్ ముఖం చూసి కాదని చెప్పారు. ఆయన పొగరు వల్లే 104గా ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 39కి పడిపోయిందనీ, అందులోనూ 25 మంది కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిపారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన కెసిఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. పదేండ్లలో పంట నష్టం ఇవ్వని ఆయన ఫామ్‌హౌజ్‌లో నిద్రపోయారని విమర్శించారు. నాలుగు మాసాల కాంగ్రెస్ పాలనను చూసి ఉలిక్కి పడుతున్న కెసిఆర్, కుర్చీ వేసుకుని కడుతా అని చెప్పిన ప్రాజెక్టుల్లో ఒక్కటైనా నిర్మించారా? అని ప్రశ్నించారు. దమ్ముంటే మేడిగడ్డకు కాదు... పాలమూరుకు రావాలని జూపల్లి సవాల్ విసిరారు. మిషన్ భగీరథలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పోయిన 12 సార్లు సోనియా, ఖర్గే అపాయింట్‌మెంట్ ఇచ్చారనీ, కెసిఆర్ ఏనాడు హైదరాబాద్‌లో ఉన్న మంత్రులను కలవలేదని తెలిపారు. తలకిందులుగా తపస్సు చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ ఒక్క లోక్ సభ సీటూ గెలవదని తెలిపారు. ఆ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిపోతే పార్టీనే రద్దు చేసుకుంటా... అని చెప్పే దమ్ము కేసీఆర్ కు ఉందా? అని ప్రశ్నించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కెసిఆర్ అత్తగారి ఊర్లో ఎవరు ఎటువైపు ఉంటారో చూద్దామా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో కెసిఆర్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని తప్పుపట్టారు. ఆయన వాడిన భాషకు కౌంటర్ ఇస్తే తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. కెసిఆర్ చవట, దద్దమ్మ కాకపోతే మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా ఎలా మార్చారని ప్రశ్నించారు. 2014 నుంచి బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రూ.4 వేల పెన్షన్ పెన్షన్ హామీని అమలు చేస్తామని తెలిపారు. బిఆర్ఎస్ హయంలో పంట నష్టం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పదేండ్లలో పాలమూరుకు కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని మంత్రి పొన్నం ఆరోపించారు.



బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా చిట్యాల పట్టణ కేంద్రంలోని సంతోష్ నగర్‌లో గుంటూరుకు చెందిన కోటేశ్వరరావు బాణసంచా తయారు చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన మేడి యాదయ్య ఇల్లును కిరాయికి తీసుకున్నారు. కొంతమంది వర్కర్లతో కలిసి బాణసంచా తయారు చేయిస్తున్నారు. శనివారం ఉదయం బాణసంచా తయారు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో కోటేశ్వరరావుతో పాటు చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన గుడిసె శాంతి, మేళ్లచెరువు మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన బానోతు సైదికి గాయాలయ్యాయి. వారిని వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సిఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్ఐ డి.సైదాబాబు పరిశీలించారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి హెచ్చరించారు.



నగరంలో తొలి జిస్ విజన్ సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : ఆప్టిక్స్, ఆప్టోఎలక్ట్రానిక్స్ సైన్స్ గ్లోబల్ సంస్థ జిస్ హైదరాబాద్‌లో తన తొలి జిస్ విజన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. స్పెక్స్‌బంకర్‌తో కలిసి దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. జూబ్లీహిల్స్‌లో దాదాపు 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో వినియోగదారులకు అత్యాధునిక కంటి సంరక్షణ పరిష్కారాలను అందించనున్నామని స్పెక్స్‌బంకర్ వ్యవస్థాకుడు, సిఇఒ మోహిత్ అగర్వాల్ తెలిపారు. ఇక్కడి విజన్ సెంటర్ విస్తృత శ్రేణిలో జిస్ లెన్స్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

కాంగ్రెస్‌ది అబద్ధాల మేనిఫెస్టో

- బిఆర్ఎస్ నేత కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో అబద్ధాల పుట్టని బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవరెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపించారు. రుణమాఫీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి, రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 మొదలగు హామీలు అమలు చేసిన తర్వాత కొత్త గ్యారంటీలు ప్రకటించాలని సూచించారు. ప్రజలను మభ్యపెట్టి లోకసభ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడుతారని హెచ్చరించారు. పార్టీ మారే నాయకులపై అనర్హత వేటు పడేలా ప్రత్యేక చట్టం తీసుకొస్తామని చెప్పిన కాంగ్రెస్ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు.

మహారాష్ట్ర అడవుల్లోకి ఏనుగు మళ్లింపు సక్సెస్

- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాలో నాలుగు రోజులుగా ప్రజలను భయాందోళనలకు గురిచేసి, ఇద్దరి మరణానికి కారణమైన ఏనుగును తిరిగి మహారాష్ట్ర అడవుల్లోకి మళ్ళించడంలో రాష్ట్ర అటవీ శాఖ చేపట్టిన చర్యలు ఫలించాయని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, అనుక్షణం అప్రమత్తతో వ్యవహరిస్తూ, జాడను కనిపెట్టుకుంటూ సురక్షితంగా ఏనుగును సమన్వయంతో మళ్లించారని తెలిపారు.

ఎసిబికి చిక్కిన మాదాపూర్ ఎస్ఐ, రైటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రూ.20వేల లంచం తీసుకుంటూ ఎసిబికి రంగారెడ్డి జిల్లా మాదాపూర్ ఎస్ఐ రంజిత్, రైటర్ విక్రమ్ శనివారం పట్టుబడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని సాయినగర్ కాలనీలో 60 గజాల్లో కృష్ణ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఆ స్థలం తనదే అని ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ, రైటర్ ఇద్దరూ కలిసి కృష్ణను రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఎసిబిని ఆశ్రయించారు. మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ, రైటర్ ఇద్దరూ లంచం తీసుకుంటుంగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దమ్మ బోనాలకు వెళ్లి తిరిగి వస్తుండగా.. టిప్పర్‌లోని మట్టి మీద పడటంతో ఊపిరాడక ముగ్గురు అన్నా చెల్లెళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటన కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. అలాగే, హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై ఫొటోలు దిగుతున్న యువకులను కారు ఢీకొట్టడంతో ఒకరు ప్రాణం కోల్పోయారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో పెద్దమ్మ బోనాలు జరిగాయి. ముదిరాజులంతా బోనాలతో దేవాలయంలో పూజల్లో పాల్గొన్నారు. బోనాలు ముగిసిన తర్వాత అన్నాచెల్లెలు గంట విజయ్, గంట వర్ష, వారి పెదనాన్న కూతురు గంట సింధూజ మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. గ్రామ మధ్యలో బొడ్రాయి వద్ద ఎదురుగా టిప్పర్ వస్తుండటంతో రోడ్డు పక్కన ఆగారు. వేగంగా వచ్చిన టిప్పర్ అదుపు తప్పి మూలమలుపు వద్ద బోల్తా పడింది. టిప్పర్‌లో ఉన్న మట్టి రోడ్డు పక్కన ఆగిన ముగ్గురు పిల్లలపై పడింది. ఆ వెనుకనే వస్తున్న సింధూజ తాత కొమురయ్య పిల్లలు కనిపించకపోవడంతో కేకలు వేశాడు. స్థానికులు వెంటనే జెసిబి సహాయంతో మట్టిని తొలగించారు. అప్పటికే ముగ్గురు పిల్లలు ఊపిరాడక ప్రాణం కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాలను హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వర్ష, సింధూజ, విజయ్ ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

కేబుల్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై శుక్రవారం అర్ధరాత్రి కారు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి.

రంగారెడ్డి జిల్లా మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ (25), అజయ్ కేబుల్ బ్రిడ్జిపై అర్ధరాత్రి ఫొటోలు దిగుతున్నారు. ఈ క్రమంలో ఓ కారు వీరిని ఢీకొట్టింది. దాంతో అనిల్, అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు. అనిల్ పరిస్థితి విషమించి మృతి చెందారు. కారు నెంబర్ ఆధారంగా యజమాని వెంకట్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, తన కారును ఇతరులు తీసుకెళ్లారని ఆయన చెప్పారు. పరారీలో ఉన్న డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



30 ప్రభుత్వ బడులకు సోలార్ రూఫ్‌టాప్‌లు

- హెచ్ఎస్‌బిసి గ్లోబల్, యుడబ్ల్యుహెచ్ సాయం

హైదరాబాద్ : యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యుడబ్ల్యుహెచ్), హెచ్ఎస్‌బిసి గ్లోబల్ సర్వీస్ సెంటర్స్ ఇండియా భాగస్వామ్యంలో తెలంగాణలోని 30 ప్రభుత్వ పాఠశాలలకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్‌ను అందిస్తున్నట్లు ప్రకటించాయి. నగరంలోని గోల్కొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 2వ లాన్సర్స్‌లో సోలార్ రూఫ్‌టాప్ ప్రారంభోత్సవంలో గ్లోబల్ సర్వీస్ సెంటర్స్ ఇండియా ఎండి, హెడ్ మమతా మాదిరెడ్డి, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సిఇఒ రేఖా శ్రీనివాసన్, ఆయా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా పాఠశాలల్లో స్వచ్ఛమైన పునరుత్పాదన ఇంధన వినియోగాన్ని పెంచనున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. తమ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ, కర్ణాటకలోని మొత్తం 65 స్కూళ్లు, ఆరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నాయి.

టెన్త్ విద్యార్థులకు ఐఐటి, నీట్‌పై ఉచిత ఆన్‌లైన్ తరగతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు 30 రోజులపాటు ఐఐటి, నీట్‌పై ఉచిత ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నట్టు మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఎ మనోజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ 30 రోజుల కోర్సులో ప్రముఖ ఐఐటియన్లు, మెడికోలతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తామని తెలిపారు. ప్రతిరోజూ పరీక్షను నిర్వహిస్తామని వివరించారు. ప్రముఖ సైకాలజిస్టు సుధీర్ సంద్రతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9090898928/9090898902 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మరోసారి అవకాశమివ్వండి!

- లేదంటే విద్యా సంవత్సరం నష్టపోతాం
- స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉన్నత విద్యను అభ్యసించే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ పేద విద్యార్థులు చాలామంది స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొత్తగా (ఫ్రెష్), పునరుద్ధరణ (రెన్యూవల్)కు దరఖాస్తు చేసుకోలేదు. దీంతో వందలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. చాలా మంది విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలుండటం వల్ల పరీక్షలపై దృష్టి పెట్టారు. ఇంకోవైపు దరఖాస్తులు చేసుకోవాలంటూ కొన్ని కాలేజీల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో వారికి స్కాలర్‌షిప్ దరఖాస్తుకు చివరి తేదీ తెలియక దరఖాస్తు చేసుకోలేదు. మార్చి 31తో దరఖాస్తు గడువు ముగిసిన విషయం తెలిసిందే. దరఖాస్తు చేసేందుకు మరోసారి అవకాశమివ్వాలంటూ హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయనికి ప్రతి రోజూ విద్యార్థులు వస్తున్నారు. అధికారులు గడువు ముగిసిందని చెప్తున్నారు. మరోసారి దరఖాస్తు చేసేందుకు అవకాశం ఇచ్చేది లేదంటున్నారు. దీంతో చాలా మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారంగానే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రాకపోతే సొంతంగా ఫీజులు చెల్లించే పరిస్థితి లేదు.

ఆ విద్యార్థులకు మరోసారి అవకాశమివ్వకపోతే విద్యా సంవత్సరం చదువుకు దూరమయ్యే ప్రమాదమున్నది. దీనివల్ల చాలామంది పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు చేసుకునేందుకు మరోవారం, పది రోజులు అవకాశం కల్పించాలంటూ కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు స్పందించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు చేసుకునేందుకు చివరిసారి అవకాశం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలికలపై లైంగిక దాడులు

- వేర్వేరు చోట్ల రెండు ఘటనలు
- నిందితుల్లో ఒకరికి రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలికలపై దారుణ ఘటనలు వెలుగుచూశాయి. వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలికలపై లైంగికదాడులు జరిగాయి. ఈ ఘటనలు వికారాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో జరిగాయి. దుండగుల్లో ఒకరిని రిమాండ్‌కు పంపగా.. మరొకరిపై ఫొక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఐనెల్లి గ్రామానికి చెందిన బూడిద అంబేష్ ఆటో డ్రైవర్. అదే గ్రామానికి చెందిన ఓ బాలిక(17) పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల కోసం అంబేష్ ఆటోలో వెళ్లింది. ఈ క్రమంలో అతను బాలికతో పరిచయం పెంచుకున్నాడు. అయితే, గురువారం బాలిక, తన స్నేహితురాలితో కలిసి తాండూర్‌లో ఓ పెండ్లికి వెళ్లింది. విషయం తెలుసుకున్న అంబేష్ అక్కడికి వెళ్లాడు. పెండ్లి అయిపోయిన తరువాత బాలికను ఇంటి దగ్గర వదలిపెడతానని ఆటో ఎక్కించుకుని తాండూర్ నుంచి ఐనెల్లి గ్రామ శివారులోని తన భూమిలోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికను బెదిరించి ఆమెపై లైంగికదాడి చేశాడు. ఆ సమయంలో ఆమెను వదిలేస్తే జరిగిన విషయం ఇంట్లో చెబుతుందని భావించి.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో ఆటోలో బాలికను తీసుకెళ్లి తాండూర్ రైల్వే స్టేషన్‌లో వదిలిపెట్టి పారిపోయాడు. అనంతరం బాధితురాలు ఇంటికి వెళ్లి విషయాన్ని అమ్మమ్మకు, అమ్మకు చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడు అంబేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తాండూర్ రూరల్ సీఐ అశోక్ తెలిపారు.

యువకునిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై చేపూర్ గ్రామ యువకుడు లైంగికదాడి చేశాడు. బాలిక(15)ను చేపూర్ గ్రామానికి చెందిన సంపత్ ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. ఈ క్రమంలో బెదిరించి ఆమెపై లైంగికదాడి చేశాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు ఇంట్లో వారికి చెప్పలేదు. అయితే, ఏప్రిల్ 3న బాలిక ఇంటి వద్ద కండ్లు తిరిగి పడిపోయింది. వెంటనే పట్టణంలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షలు చేసి మూడు నెలల గర్భవతి అని చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు విషయం తెలుసుకుని.. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంపత్‌పై ఫొక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

15 కోట్ల మార్క్‌కు డిమ్యాట్ ఖాతాలు

- ఏడాదిలో కొత్తగా 3.5 కోట్ల ఎకౌంట్స్ జారీ



న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో రికార్డ్ స్థాయిలో కొత్తగా 3.7 కోట్ల డిమ్యాట్ ఖాతాలు తెరిచారు. అంతక్రితం ఏడాదితో పోల్చితే 32 శాతం అధికం. స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడులపై ఆసక్తులు పెరగడంతో భారీ సంఖ్యలో కొత్త ఖాతాలు నమోదవుతున్నాయి. 2024 మార్చి ముగింపు నాటికి దేశంలో మొత్తం డీమ్యాట్ ఖాతాలు 15 కోట్లు దాటి నూతన మైలురాయిని చేరుకున్నాయి. ఈక్విటీ మార్కెట్ల నుంచి ఆకర్షణీయ రాబడులను పొందవచ్చనే ఆలోచనలతో అనేక మంది డిమ్యాట్ ఖాతాలను తెరిచారు. గడిచిన ఏడాది కాలంలో సగటున ప్రతి నెలా 30 లక్షలకు పైగా కొత్త డీమ్యాట్ ఖాతాలు నమోదయ్యాయి. 2020-21లో 1.4 కోట్ల కొత్త డిమ్యాట్ ఖాతాలు తెరుబడ్డాయి.

దేశంలో సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సిడిఎస్ఎల్), నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్)లు డిమ్యాట్ ఖాతాలను తెరవడం, నిర్వహించడం చేస్తున్నాయి. గడిచిన ఏడాదిలో ఈ సంస్థలు వరుసగా 11.9 శాతం, 15.14 శాతం పెరుగుదలను సాధించాయి. 2023 మార్చి ముగింపు నాటికి దేశంలో ఈ రెండు సంస్థలు కలిసి 11.45 కోట్ల డిమ్యాట్ ఖాతాలను అందించాయి. భారత మార్కెట్లపై పలు ఏజెన్సీలు అంచనాలు పెంచడం, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెరగడం, ఈక్విటీలపై యువత ఆసక్తి, పలు కంపెనీలు ఐపిఒలకు రావడం తదితర అంశాలు డిమ్యాట్ ఖాతాల పెరుగుదలకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2023-24లో ఐపిఒల ద్వారా ద్వారా 76 కంపెనీలు రూ.61,921 కోట్ల నిధులు సమీకరించాయి. అదే ఏడాది సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 24.85 శాతం, 28.61 శాతం చొప్పున రిటర్న్‌లను అందించాయి. బిఎస్ఇ మిడ్ క్యాప్ సూచీ 63.4 శాతం, స్మాల్ క్యాప్ 60 శాతం చొప్పున పెరిగాయి.

హయర్ నుంచి హెక్సా ఇన్వర్టర్ టెక్నాలజీ ఏసిలు

న్యూఢిల్లీ : హెక్సా ఇన్వర్టర్ టెక్నాలజీతో పనిచేసే సూపర్ హెవీ డ్యూటీ రేంజ్ ఎయిర్ కండీషనర్ (ఎసి)లను మార్కెట్ లోకి విడుదల చేసినట్లు హయర్ ఇండియా తెలిపింది. ఈ టెక్నాలజీతో దాదాపు 65 శాతం ఇంధన ఆదా అవుతుందని పేర్కొంది. 5 ఏళ్ల కాంప్రెహెన్సివ్ వారంటీతో పాటు రూ.15,990ల విలువైన గ్యాస్ ఛార్జింగ్, రూ.8000 వరకు క్యాష్ బ్యాక్, రూ.1500 విలువ చేసే ఉచిత స్టాండర్డ్ ఇన్‌స్టాలేషన్, 12 ఏళ్ల పాటు కంప్రెషర్ వారంటీని అందిస్తున్నట్లు తెలిపింది. ఈ మోడళ్లు రూ.49,990 ప్రారంభ ధరతో లభిస్తాయని పేర్కొంది.

మతోన్మాదాన్ని ఎదుర్కొని లౌకికత్వాన్ని కాపాడుతాం

- వామపక్షాల పోరాట ఫలితమే ఉపాధి హామీ చట్టం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలపై కొట్లాడేందుకు పార్లమెంట్‌లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఎంతో అవసరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. దేశాన్ని మతోన్మాద ప్రమాదం నుంచి ఎదుర్కొని, లౌకికత్వాన్ని కాపాడుతామన్నారు. సిపిఎం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం ఇబ్రహీంపట్నంలోని పాషా-నరహరి స్మారక కేంద్రంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి జాన్‌వెస్లీతోపాటు భువనగిరి పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యం అత్యధికంగా ఉందన్నారు. నకిరేకల్, భువనగిరి, జనగామ, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం, మునుగోడు నియోజకవర్గాల అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించారని చెప్పారు. ఈ ప్రాంతం నేటికీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వం కలిగి ఉందన్నారు. భూ పోరాటాలతోపాటు తాగు, సాగు నీటి కోసం సిపిఎం ఆధ్వర్యంలో అవిశ్రాంత పోరాటాలు నిర్వహించి విజయం సాధించామని తెలిపారు. భువనగిరి పార్లమెంటు సరిహద్దులు ఇతర పార్టీల అభ్యర్థులకు తెలుసా అని ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో ఏనాడైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పోరాటాలు చేశాయా? అని నిలదీశారు. గత యుపిఎ ప్రభుత్వంలో వామపక్షాల బలం ఉన్న కారణంగానే జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని సాధించుకున్నామని తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని సాధించుకున్నామన్నారు. బిజెపి అధికారం చేపట్టిన తర్వాత ఈ చట్టాలను తుంగలో తొక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ సరైన పంథాలో పోరాటాలు నిర్వహించడం లేదని విమర్శించారు. లౌకిక విలువలను కాపాడటంలో విఫలమైనదన్నారు.

భువనగిరి ఎంపి అభ్యర్థి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపిందన్నారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని తెలిపారు. అభ్యుదయవాదులు, అవకాశవాదులకు మధ్య ఈ పోటీ జరుగుతున్నదన్నారు. డబ్బులు వెదజల్లి గెలవాలని చూస్తున్న పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ చరిత్ర ఏంటో ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను ఇంకా ఎన్ని సంవత్సరాలు కొనసాగిస్తారని ప్రశ్నించారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల అనేక ప్రాజెక్టులు వెనుకబడుతున్నాయన్నారు. తెలంగాణకు ఎయిమ్స్ ఇచ్చినా కనీస వసతులు కల్పించడం లేదని, 44 డిపార్ట్‌మెంట్లు ఉంటే 20 డిపార్ట్‌మెంట్లు మాత్రమే పని చేస్తున్నాయని చెప్పారు. మూసీ ప్రక్షాళనతోపాటు ముందు మూసీని శుద్ధి చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ పోరాట వారసత్వం కలిగిన కమ్యూనిస్టు అభ్యర్థిగా తాను ప్రజల ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఆదరించి, అభిమానించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కడిగల్ల భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాంనాయక్, జగదీష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదయ్య, సామెల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమన్వయకర్తలను నియమించిన బిఆర్ఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పలు పార్లమెంట్ నియోజకవర్గాలకు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్నికల సమన్వయకర్తలను బిఆర్ఎస్ నియమించింది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం... మేడ్చల్- శంబిపూర్ రాజు (ఎమ్మెల్సీ), మల్కాజిగిరి- నందికంటి శ్రీధర్, కుత్బుల్లాపూర్ - గొట్టిముక్కుల వెంగళరావు, కూకట్‌పల్లి- బేతి రెడ్డి సుభాష్ రెడ్డి(ఎమ్మెల్యే), ఉప్పల్- జహంగీర్‌పాషా, సికింద్రాబాద్ కంటోన్మెంట్- రావుల శ్రీధర్ రెడ్డి, ఎల్బీనగర్ - బొగ్గరపు దయానంద్ గుప్త (ఎమ్మెల్సీ)లను నియమిచారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం... మహేశ్వరం- కనకమామిడి స్వామి గౌడ్, రాజేంద్రనగర్- పుట్టం పురుషోత్తంరావు, శేరిలింగంపల్లి- కె నవీన్ కుమార్ (ఎమ్మెల్సీ), చేవెళ్ల- నాగేందర్ గౌడ్,

పరిగి- గట్టు రామచంద్రరావు, వికారాబాద్- పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తాండూర్- బైండ్ల విజయ్ కుమార్‌లను సమన్వయ కర్తలుగా నియమించినట్టు బిఆర్ఎస్ ఓ ప్రకటనలో పేర్కొంది.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి న్యాక్ ఎ గ్రేడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒపెన్ విశ్వవిద్యాలయానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) ఎ గ్రేడ్ గుర్తింపు వచ్చింది. ఈ మేరకు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ ఎవిఎన్ రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది జులైలో న్యాక్ బృందం విశ్వవిద్యాలయంలో పర్యటించి అన్ని విభాగాలనూ పర్యవేక్షించి 2.96 పాయింట్లతో బి ప్లస్ ప్లస్ గ్రేడ్ ఇచ్చిందని తెలిపారు. తమకు రావాల్సిన స్థాయిలో పాయింట్లు రాలేదంటూ మళ్లీ అసెస్‌మెంట్ కావాలని న్యాక్‌కు దరఖాస్తు చేశామని పేర్కొన్నారు. దీంతో న్యాక్ కమిటీ ఆరుగురు సభ్యుల బృందంతో మార్చి 21-23 వరకు మళ్లీ అసెస్‌మెంట్ చేశారని వివరించారు. ఆ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం న్యాక్ పాలక వర్గం శనివారం బెంగుళూరులో సమావేశమై అంబేద్కర్ ఓపెన్ విశ్వవిద్యాలయానికి నాలుగు పాయింట్ల ఫార్ములాలో 3.12 స్కోర్‌తో ఏ గ్రేడ్ కేటాయించిందని వెల్లడించారు. ఎ గ్రేడ్ రావడం పట్ల, అందు కోసం కష్టపడ్డ ఉద్యోగులకు విశ్వవిద్యాలయ వీసీ సీతారామారావు అభినందనలు తెలిపారు.

ఆగని పసిడి దరువు

ముంబయి : బంగారం ధరల దరువు ఆగడం లేదు. రోజు రోజుకు పెరుగుతూ నూతన రికార్డ్‌లను సృష్టిస్తుంది. తులం బంగారం 71వేల ఎగువకు చేరడంతో సామాన్యుడు కొనలేని స్థాయికి చేరింది. గుడ్‌రిటర్న్స్ రిపోర్ట్ ప్రకారం.. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1,310 పెరిగి రూ.71,400కు చేరింది. 22 క్యారెట్లపై రూ.1,200 ఎగిసి రూ.65,500గా నమోదయ్యింది. 18 క్యారెట్లపై రూ.980 పెరిగి రూ.53,590గా పలికింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ ధర రూ.71,290గా, 22 క్యారెట్ల ధర రూ.65,350 వద్ద నమోదయ్యింది. కిలో వెండిపై రూ.2,000 పెరిగి రూ.87వేలుగా పలికింది.

పెట్టుబడులపై ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి అవగాహన

హైదరాబాద్ : పెట్టుబడులపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) నిబంధనలు, నియమాల గురించి ఇన్వెస్టర్లలో అవగాహన కల్పిస్తున్నట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. సెబీ 2015 రెగ్యులేషన్ 8 షెడ్యూల్‌లోని ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిషేధం రెగ్యులేషన్స్‌పై పెట్టుబడిదారులకు తమ బ్యాంక్ అవగాహన పెంచుతుందని ఆ బ్యాంక్ డైరెక్టర్ సంజీవ్ బర్న్వాల్ తెలిపారు. డిసెంబర్ 2023 త్రైమాసికంలో తమ బ్యాంక్ డిపాజిట్లు 24 శాతం వృద్ధితో రూ.31,650 కోట్లకు చేరాయని పేర్కొన్నారు. కరెంట్ ఎకౌంట్, సేవింగ్ ఎకౌంట్‌లో బలమైన వృద్ధిని నమోదు చేస్తున్నామన్నారు.

రామ్కీ ఇన్‌ఫ్రాకు బహుళ అవార్డులు



హైదరాబాద్: నిర్మాణ పరిశ్రమ అభివద్ధి మండలి (సిఐడిసి) నిర్వహించిన 15వ విశ్వకర్మ అవార్డ్స్ 2024లో తమకు బహుళ అవార్డులు దక్కినట్లు రామ్కీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ తెలిపింది. తాము అద్భుతమైన విజయాలను అందుకున్నట్లు వెల్లడించింది. నిర్మాణ రంగంలో స్థిరత్వం పట్ల కంపెనీ చూపుతున్న నిబద్ధతకు ఈ ప్రశంసలు నిదర్శమని తెలిపింది. ఉత్తమ నిర్మాణ ప్రాజెక్టులు, సామాజిక అభివృద్ధి, ఉత్తమ వృత్తి, ఆరోగ్యం, భద్రత విభాగాల్లో నాలుగుఅవార్డులను పొందినట్లు పేర్కొంది.